

కథా కౌముది

అస్మిత — శ్రీనివాస్ వల్లంభట్ల

ఫోన్ మోగుతోంది, మీటింగ్ లో వుండడంతో సైలెంట్ మోడ్ లో వుంది. ఒక సారి చూసాడు ఫోన్ వంక, ఈ టైం లో అక్క ఎప్పుడూ ఫోన్ చేయదు, ఎందుకబ్బా.. అని ఒక క్షణం ఆలోచించి, లంచ్ టైం లో తిరిగి కాల్ చెయ్యచ్చులే అని ఫోన్ తీయలేదు వివేక్. మీటింగ్ అయ్యేసరికి 6 మిస్డ్ కాల్స్.


ఒక్క ఉదుటున ఫోన్ అందుకుని కాల్ చేసాడు. "అక్క, ఏమిటే.. ఏం జరిగింది?" ఆదుర్దాగా అడిగాడు.

"నువ్వు ఆఫీస్ లో ఉన్నవని తెలుసు, బిజీ అని తెలుసు.. కానీ ఇబ్బంది చేయక తప్పలేదు.." అంటూ వివరం చెప్పింది.

"సరే, ఈవెనింగ్ ఐదింటికి ఫ్లైట్ ల్యాండ్ అవుతుంది, ఎయిర్పోర్ట్ కి నేను వెళ్లి పికప్ చేసుకుంటా సరేనా.." ఫోన్ కట్ చేశాడు.

వెంటనే తన ఎమర్జెన్సీ లైన్, అనగా శ్రీమతి మైత్రేయికి కాల్ చేసి విషయం టూకీగా వివరించాడు. "సరే వచ్చాక చూద్దాం, ఆలోచిద్దాం.." ఇలాంటి పెద్ద తరహా మాటలతో ఫోన్ పెట్టేసింది మైత్రేయి.

ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఎయిర్పోర్ట్ కి చేరుకున్నాడు వివేక్. చిన్న గుచి బాగ్, మరో రోలరు లగేజీ తో అస్మిత వివేక్ వైపు విసవిసా వస్తోంది. ఆమ్మో, దీని కోపాన్ని భరిస్తూ గంట కార్ డ్రైవ్ చెయ్యాలి ఇంటికి వెళ్లాలంటే అనుకుంటూ "రావే.. ఏంటి బెంగుళూరు లో చైనీస్ ఫుడ్ తినాలని అనిపించిందా.. ఓహ్ మావయ్యని చూడాలనిపించిందా.." సిట్యుయేషన్ ని లైట్ చేద్దామనే విఫల ప్రయత్నం చేసాడు.



ఒక్క మాట మాట్లాడకుండా కార్ ఎక్కింది. ఇంటికి చేరుకున్నాక "ఏంటి, Matrix ఇంకా రాలేదా.." అంటూ లగేజీ వివేక్ చేతిలోంచి లాక్కుని ఇంట్లోకి వెళ్ళింది. అస్మిత కి మైత్రేయి మంచి ఫ్రెండ్, ఏ సమస్యకైనా చిటికెలో పరిష్కారం చూపుతుందని మైత్రేయికి "Matrix" అని పేరు పెట్టింది అస్మిత.

వివేక్ పది సంవత్సరాలు వున్నపుడే పేరెంట్స్ ఇద్దరూ ఆక్సిడెంట్ లో చనిపోయారు. అక్క, బావ అమ్మ నాన్నలై వివేక్ ని పెంచి చదివించారు, మైత్రేయి తో మ్యారేజ్ కూడా దగ్గరుండి జరిపించారు. వాళ్ళకి లేట్ గా పుట్టిన గారాలపట్టి అస్మిత. వివేక్ అయితే దాని కాలు నేల మీద పెట్టనివ్వడు, అంత ప్రేమ మేన కోడలంటే.

ముగ్గురూ డిన్నర్ కి వెళ్లారు. కాసేపు లేడీస్ ఇద్దరూ లేటెస్ట్ ఫాషన్ ట్రెండ్స్ గురించి చర్చించారు. "నేను ఇంక బెంగుళూరు లోనే వుంటాను, డన్ విత్ హైదరాబాద్, ఇక్కడే కాలేజీ లో జాయిన్ అవుతాను" అంటూ డెసిషన్ ఆల్రెడీ టేకెన్ అన్నట్లు వివేక్ వైపు చూసి, ఐస్ క్రీం తింటూ చెప్పింది అస్మిత. మైత్రేయి థంబ్స్ అప్ అన్నట్లు చూపించి, ఏదో అడగబోయిన వివేక్ ని వారించింది.

ముగ్గురూ కొత్తగా రిలీజ్ అవ్వబోయే ఇంగ్లీష్ మూవీ గురించి కబుర్లు చెప్పుకున్నారు, కాసేపు ఇందిరా నగర్ వీధుల్లో వాక్ చేసి, నెమ్మదిగా పదకొండింటికి ఇంటికి చేరుకున్నారు. తుఫాను కాస్త శాంతించినట్లు అనిపించి, "మామ్ డాడ్ ఎలా ఉన్నారే..?" అంటూ మాట కలపబోయాడు వివేక్.

"ఒకే.. నాకు నిద్ర వస్తోంది... WiFi పాస్వర్డ్ ఏమిటి."

"వారి దీని యాసాలో.." అని మనసులో అనుకుని సైలెంట్ గా సంధి కుదుర్చుకున్నాడు వివేక్.

నిద్ర కి ఉపక్రమిస్తూ "హౌ టు హేండిల్ టీన్ గర్ల్" అని చాట్ జిపిటి లో కొడదామని.. బలవంతంగా ఆపుకుని, మైత్రేయితో "సో.. ఏమి చేద్దామనుకుంటున్నావు?" అని గంభీరంగా అడిగాడు వివేక్.

"చిన్న పిల్ల చేతిలో చాక్లెట్ లాక్కోవాలంటే అంతకన్నా తీయనిది మన దగ్గర ఉండాలి. అన్ని తెలుసు అనుకునే, ఏమీ తెలియని వయసు అస్మితది. ఆలోచిద్దాం, ముల్లును ముల్లుతోనే తీయాలి... నాకు పొద్దున్నే మీటింగ్ వుంది మిగతాది రేపు చెప్తాలే" అంటూ సడన్‌గా డిస్కషన్ ఆపి, శ్రద్ధగా వింటున్న వివేక్‌ని ఆటపట్టించింది మైత్రేయి. ఇద్దరూ లైట్లు ఆపేసి ఆలోచనలతో కళ్ళు మూసుకున్నారు.

పక్క రూమ్‌లో అస్మిత తన ఇన్స్టా చాట్‌లో లీనమైపోయింది. తెల్లవారుజామున మూడు గంటల వరకు కబుర్లు చెప్తూనే ఉంది. ఈ మధ్య అదే పనిగా గంటల తరబడి ఫోన్లో ఉండటంతో హైదరాబాద్‌లో అక్కా, బావ ఆమెపై నిఘా వేశారు. తను పడుకున్నప్పుడు ఫోన్ చూసి ఎవరో ఆర్యన్ అనేవాడితో చాట్ చేస్తోందని తెలుసుకున్నారు. పరిస్థితి పర్సనల్ ఫోటోలు అడిగేదాకా వచ్చిందని, అర్జెంట్‌గా పిల్లని ఒక దారిలో పెట్టాకే తిరిగి హైదరాబాద్ పంపమని పొద్దున్న అక్కయ్య వివేక్‌కి చేసిన ఫోన్ కాల్ సారాంశం.

ఒక రకంగా అస్మిత తనంతట తానే బెంగుళూరుకి వచ్చాను అనుకుంది, కానీ అమ్మా, నాన్నా పథకంలో భాగంగానే బెంగుళూరు వచ్చింది.

పక్క రూమ్ లో ఐదు అవుతుండగా నిద్ర లేచిన మైత్రేయి ఒక ప్లాన్ తయారుచేసి వివేక్ ని నిద్ర లేపింది. మొదట వివేక్ ఇది సరైన దారా అని సంశయించినా, ఆలోచించి సరే అన్నాడు.

ఆ ప్లాన్ ప్రకారం, అస్మిత చిన్నప్పటి ఫ్రెండ్ శ్రేయ. వాళ్ళు ఢిల్లీ కి మూవ్ అయ్యాక ఇద్దరి మధ్య కమ్యూనికేషన్ లేదని రూఢి చేసుకున్నారు. శ్రేయ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ఫేక్ అకౌంట్ క్రియేట్ చేశారు. "హే అస్మీ! నా పాత ఫోన్ పోయింది, పాత అకౌంట్ యాక్సెస్ లేదు. ఇది నా కొత్త ప్రైవేట్ ఇన్‌స్టా ఐడీ. నిన్ను చాలా మిస్ అయ్యాను!" అని శ్రేయ పేరుతో అస్మిత కి మెసేజ్ ఇచ్చారు.

మెసేజ్ పంపి, ఫోన్ పక్కన పెట్టేసింది మైత్రేయి, గుండె వేగంగా కొట్టుకుంటూ ఉంది తనకి కూడా, ఇది తప్పా ఒప్పా అని ఆలోచించే టైం లేదు ఇప్పుడు.

రెండు నిమిషాల్లో రిప్లై వచ్చింది. "శ్రేయ్!!! నిజంగానా?? ఎన్నాళ్ళైంది!! నువ్వు లేకపోతే స్కూల్ ఎంత బోర్ కొట్టేదో తెలుసా" అస్మిత కి తెలియకుండానే మొహం మీద నవ్వు వచ్చింది. చిన్నప్పటి స్నేహం ఎవరికైనా అంతే కదా, ఎంత దూరమైనా, ఒక్క మెసేజ్ తో వెంటనే వెనక్కి లాక్కేళుతుంది.

ఫ్రెండ్స్-4-ఎవర్ అని గ్రూప్ క్రియేట్ చేసి, ఒకరిద్దరు అస్మిత ఫ్రెండ్స్ని, అస్మిత ని అందులో ఆడ్ చేశారు. ఇంకేముంది, అరగంటలో అస్మిత ఒక పది మందిని, వాళ్ళు మరో వంద మందిని ఆడ్ చేసారు. ఇహ ఒక వారం రోజులు, రెగ్యులర్ చాట్ కబుర్లు, గ్రూప్ మొత్తం బిజీ.

వివేక్, నెమ్మదిగా అస్మిత తో ప్రైవేట్ చాట్ స్టార్ట్ చేసి, చిన్నప్పటి స్కూల్ జ్ఞాపకాలు, వీళ్లిద్దరికీ సంబంధించి తనకి తెలిసిన సందర్భాలు, ఇద్దరూ కలిసి విన్ ఐన గేమ్స్, ఇష్టమైన టీచర్స్ ఇలా ఎన్నో విషయాలు చెప్పి శ్రేయ తోనే తాను మాట్లాడుతున్నట్లు అస్మితని నమ్మించాడు. వీళ్లిద్దరు వున్న చిన్నప్పటి ఫొటోస్ షేర్ చేసాడు. ఇద్దరి మధ్యా పాత స్నేహం మళ్ళీ చిగురించింది. అదృష్టం ఏమిటంటే నిజమైన శ్రేయ కాంటాక్ట్ ఎవరి దగ్గర లేదు.

ఇలా మూడు వారాలు గడిచాక, ఎదురు చూస్తున్న క్షణం రానే వచ్చింది. ఒక రాత్రి పన్నెండు దాటాక, "నాకు బాయ్ ఫ్రెండ్ వున్నాడు, వాడి పేరు విరాజ్, చాలా క్యూట్‌గా ఉంటాడు 🙈" అని రాసింది శ్రేయ పేరుతో మైత్రేయి, టైప్ చేస్తూ చేయి కొంచెం వణికింది. "నీ పరిస్థితి ఏంటి? ఏమన్నా సీక్రెట్స్ ఉన్నాయా 👀" అని జోడించింది.

అస్మిత రెండు నిమిషాలు రిప్లై ఇవ్వలేదు. మైత్రేయి ఊపిరి బిగపట్టి ఫోన్ వైపే చూస్తోంది. చివరికి "నీకు ఒక్క దానికే కాదు, నాక్కూడా ఒకడున్నాడు 😅 పేరు ఆర్యన్." అంటూ, తర్వాత పది నిమిషాల్లో అస్మిత తనకి తెలిసిన ఆర్యన్ ఇన్స్టా హ్యాండిల్, ఏ కాలేజీ, ఎలా పరిచయం అయ్యింది, అన్నీ ఏకరువుగా చెప్పేసింది. ఎవరితోనూ చెప్పలేని విషయం ఒక దగ్గరి స్నేహితురాలికి చెప్పినట్టు అనిపించి, భారం దిగినట్టు అనిపించింది తనకి.

వెంటనే ఆర్యన్‌ను పరీక్షించేందుకు మరో అకౌంట్ క్రియేట్ చేసి, సదరు ఆర్యన్ తో చాట్ మొదలు పెట్టింది మైత్రేయి. వాడి మాటల్లోని చిన్న చిన్న పొరపాట్లు, అలవాట్లు, కామన్ ఫ్రెండ్స్ వివరాలు కలిపి చూస్తూ మైత్రేయి వాడి అసలు వివరాలు బయటకు తీసింది. ఒక వారం లో వాడి అసలు పేరు సత్తి పండు (అలియాస్ బుజ్జి) అని తెలిసింది. మరో వారం చాట్ చేసి ఎక్కడ కలుద్దాం అనగానే, లొకేషన్ పెట్టాడు.

స్క్రీన్ షాట్ తీసి శ్రేయ అకౌంట్ ద్వారా అస్మిత కి పంపింది మైత్రేయి. కింద ఒక్క లైన్: "అస్మీ, ఇది నీకు చెప్పాలో వద్దో అని రెండు రోజులు ఆలోచించా. ఇతను నాతో కూడా ఇలాగే మాట్లాడుతున్నాడు."

అస్మిత ఫోన్ చేతిలో పట్టుకుని అలాగే కూర్చుండిపోయింది. మొదట కోపం వచ్చింది శ్రేయ మీద, తనని అవమానిస్తోందా అని. స్క్రీన్‌షాట్ లోని మాటలు మళ్ళీ మళ్ళీ చదివింది, ప్రతీసారి తనతో ఆర్యన్ చెప్పిన మాటలే కనిపించేసరికి లోపల ఏదో కూలిపోయినట్టు అనిపించింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి, కానీ ఏడవాలని లేదు, ఏదో మోసపోయిన బాధ, తనని తానే నమ్మలేని వెలితి.

మర్నాడు పొద్దున్న మామూలుగా కనిపించడానికి ప్రయత్నించింది అస్మిత, వివేక్, మైత్రేయి ముందు. మధ్యాహ్నం ఒక్క లైన్ మెసేజ్ పంపింది ఆర్యన్ కి "మనం ఇక మాట్లాడొద్దు", రిప్లై కోసం చూడకుండా అకౌంట్ బ్లాక్ చేసి, ఫోన్ లాక్ చేసేసింది.

తరువాత ఇంటర్ ఫస్ట్ ఇయర్ సెకండ్ టైం చదువుతున్న ఆర్యన్ గాడిని, అదే మన హీరో లాంటి విల్లన్ బుజ్జి ని సైబర్ సెల్ కి కంప్లైంట్ చేస్తామని బెదరగొట్టాడు వివేక్, అది వేరే విషయం.

బ్రేకప్ తర్వాత వారం రోజులు అస్మిత ముభావంగా మారిపోయింది. ఇంట్లో తిరుగుతూ, తినేటప్పుడు కూడా మాటలు తక్కువయ్యాయి. మైత్రేయి, వివేక్ ఇద్దరూ చూస్తూనే ఉన్నారు, పైకి ఏమీ అనకుండా. అదే అదనుగా, ఒక రోజు ఈవెనింగ్ మైత్రేయి తన ఆఫీస్ కొలీగ్ బ్రదర్ అగస్త్యని పరిచయం చేసింది.


మైత్రేయి ఇచ్చిన కాఫీ కప్ తీసుకుంటూ అస్మిత వైపు చూసి "పైథాన్ వచ్చా?" అడిగాడు. అస్మిత కొంచెం ఆశ్చర్యపోయింది, ఇలా పరిచయం కూడా లేకుండా మాట్లాడేవాళ్ళు తక్కువ. "కొంచెం" అని బదులిచ్చింది, కొంచెం విసుగ్గానే. "చాలు" అన్నాడు. ఎవడో వచ్చి ఇలా ఆర్డర్ వేసినట్టు మాట్లాడతాడా అని కొంచెం కోపం వచ్చింది అస్మితకి. కానీ ఆ రాత్రి పడుకునే ముందు, ఖాళీగా ఉన్న ఫోన్ స్క్రీన్ వైపు చూస్తూ, "పోనీ వెళ్దాం, కనీసం టైం పాస్ అవుతుంది" అనుకుంది.

అతని గ్రూప్ ఒక స్టార్ట్అప్ హ్యాకథాన్ లో పార్టిసిపేట్ చేస్తున్నారు. వాళ్ళు పైథాన్ ప్రోగ్రామింగ్ తెల్సిన ఒక టీం మెంబెర్ కోసం చూస్తున్నారని, నచ్చితే తాను జాయిన్ అవ్వచ్చని అస్మిత ని స్లోగా డైవర్ట్ చేసింది మైత్రేయి. అదే రోజు వివేక్ తన పర్సనల్ లాప్టాప్ ని అస్మిత కి గిఫ్ట్ గా ఇచ్చాడు, అస్మిత బిజీ అవటానికి వాడిన లాస్ట్ స్ట్రాటజీ. స్లోగా వాళ్ళు అనుకున్న పథకం మొత్తం వర్కౌట్ ఐంది.



తరువాత రెండు వారాలు అస్మిత టీం తో కలిసి రాత్రి పగలు కష్టపడి వర్క్ చేసింది. అగస్త్య మొదట్లో కఠినంగా అనిపించినా, అతని మెంటోర్షిప్ లో అస్మిత వేగంగా నేర్చుకుంది. అనుకోని గమ్మత్తు ఏమిటంటే, వీళ్ళ టీం కాంపిటీషన్ లో విన్ ఐంది. రిజల్ట్ అనౌన్స్ అయిన క్షణంలో అస్మితకి తన మనసులో వచ్చిన సంతోషం, ఆర్యన్ తో చాట్ చేసేటప్పుడు అనిపించిన థ్రిల్ కంటే వేరేగా అనిపించింది. ఇది ఎవరో ఇచ్చిన లైక్‌కో, కామెంట్‌కో వచ్చింది కాదు, తనే సంపాదించుకున్నది.

సమ్మర్ హాలిడేస్ ముగిసాయి. నెక్స్ట్ డే అస్మిత తిరిగి హైదరాబాద్ కి వెళ్లి పోతోంది. లైట్ ఆఫ్ చేస్తూ "పెద్ద ముల్లు తో చిన్న ముల్లు తీయడం అంటే ఇదే సారూ.." అని చిన్నగా నవ్వింది మైత్రేయి. "అస్మిత కి ఎప్పటికైనా నిజం తెలిస్తే ఈ మావయ్య మీద నమ్మకం పోతుందేమో...", "అన్నిటికన్నా అస్మిత భవిష్యత్తు మనకి ముఖ్యం" అని సముదాయించింది మైత్రేయి. సమస్య తీరడం తో ఇద్దరూ హాయిగా నిద్ర పోయారు. పక్క రూమ్ లో అస్మిత అప్పటికే రోజంతా వర్క్ చేయటం తో అలసిపోయి నిద్ర పోయింది.



✦ ✦ ✦

మరుసటి రోజు, అస్మిత ని ఎయిర్పోర్ట్ లో డ్రాప్ చేసాడు వివేక్. బాయ్ చెప్పి వెనక్కి తిరిగి చూసి, పరుగున వచ్చి వివేక్ బుగ్గ మీద కిస్ చేసి "లవ్ యు టూ మావయ్య.." అంటూ వెళ్ళిపోయింది అస్మిత. సెక్యూరిటీ చెక్ వైపు నడుస్తూ మరోసారి వెనక్కి తిరిగి చేయి ఊపింది. వివేక్ కళ్ళు చెమర్చాయి, నవ్వుతూ చేయి ఊపాడు.

దానికి ఒక రోజు ముందు, కాంపిటీషన్ లో గెలిచి తిరిగి వస్తున్నప్పుడు, కార్ డ్రైవ్ చేస్తూ వివేక్ అన్నాడు: "కంగ్రాట్స్ రా బంగారం, ప్రౌడ్ అఫ్ యు. అస్మిత.. నీ పేరుకు రెండు అర్థాలు ఉన్నాయని తెలుసా? ఒకటి.. నీ వ్యక్తిత్వం. రెండోది.. భ్రమ. ఈ రెండింటి మధ్య తేడా తెలుసుకున్న రోజే నువ్వు నిజంగా పెద్దదానివి అవుతావు" అని లాలనగా తల మీద చేయి వేసి నిమురుతూ.

COMMENTS